క్లుప్తంగా

ప్రతి రైతుకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి



ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేస్తున్న వీఏఏ భవాని

మునగపాక: ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తోటాడ సచివాలయ వీఏఏ భవానీ తెలిపారు. మండలంలోని మూలపేట శివారు గంగాదేవిపేట పైడితల్లి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో శనివారం ఫార్మర్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు పీఎం కిసాన్‌తో పాటు అన్నదాత సుఖీభవ వంటి పథకాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

రామాలయం నిర్మాణానికి బొడ్డేడ విరాళం



విరాళం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

మునగపాక: మునగపాక దళితవాడలో నిర్మిస్తున్న రామాలయం పనులు చురుగ్గా సాగుతున్నాయి. వచ్చే నెల 15న ఆలయ ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నారు. దీనిలో భాగంగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ ఆలయ నిర్మాణానికి తనవంతు సాయంగా శనివారం రూ.లక్షా 25 వేల చెక్కు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు, వైఎస్సార్‌సీపీ దళిత విభాగం జిల్లా అధ్యక్షుడు పిల్లి అప్పారావు, కోనపల్లి రామ్మోహనరావు, ఆడారి కాశీబాబు, రాజాన బుజ్జి, కోరుకొండ ఈశ్వరరావు, బీలా లక్ష్మణరావు, కరణం గణేష్, దిమ్మల నూకరాజు, ఆడారి రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

ధ్వజ స్తంభానికి పూజలు



తిమ్మరాజుపేటలో ధ్వజ స్తంభానికి పూజలు చేస్తున్న భక్తులు

మునగపాక: మండలంలోని తిమ్మరాజుపేటలో నూతనంగా నిర్మిస్తున్న కలియుగ దైవం శ్రీనివాసుని ఆలయ పనులు చురుగ్గా సాగుతున్నాయి. దీనిలో భాగంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్న ధ్వజ స్తంభాన్ని శనివారం తీసుకువచ్చారు. దీంతో యాగశాలలో ధ్వజ స్తంభానికి పసుపు, కుంకుమ అద్ది పూజలు చేశారు. సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి కృష్ణారావు కుటుంబ సభ్యుల ఆర్థిక సహకారంతో ధ్వజ స్తంభం ఏర్పాటు చేయనున్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులతో పాటు అన్నమాచార్య ఆలాపన బృంద సభ్యులు పాల్గొన్నారు.

వివాదాలను స్థానికంగానే పరిష్కరించుకోవాలి



ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో పాల్గొన్న మండల ప్రత్యేకాధికారి ప్రభాకరరావు తదితరులు

మునగపాక: ప్రతి ఒక్కరూ శాంతియుతంగా జీవిస్తూ, వివాదాలను స్థానికంగానే పరిష్కరించుకోవాలని మండల ప్రత్యేకాధికారి ప్రభాకరరావు అన్నారు. మునగపాక రెవెన్యూ కార్యాలయంలో శనివారం మండల స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటాపురానికి సంబంధించి భూ వివాదానికి కారణమైన ఇరు వర్గాల వారితో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు, ఎంపీడీవో ఎం.ఉషారాణి, ఎస్‌ఐ పి.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

అప్పారావు మృతికి సంతాపం



గోవిందరావును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు

ఎస్.రాయవరం: మండల కేంద్రంలో మూడు రోజుల క్రితం వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు తండ్రి అప్పారావు మృతి చెందగా మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ఎంపీపీ కోన లోవలక్ష్మి, మాజీ వైస్ ఎంపీపీ కొణతాల శ్రీనివాసరావు, వమ్మవరం సర్పంచ్ పాలపర్తి పాపారావు, గుర్రం నానాజీ, పోచిన నరేష్ తదితరులు పాల్గొన్నారు.

దయనీయం

- హరిపాలెం పీహెచ్‌సీపై అధికారుల శీతకన్ను
- రేగుపాలెం వైద్యురాలికి అదనపు బాధ్యతలు
- వాచ్‌మెన్, అటెండర్ లేక భయం భయంగా రాత్రి వేళ స్టాఫ్ నర్సుల సేవలు



సాయంత్రం వేళ ఓపీ చూస్తున్న స్టాఫ్ నర్సు



హరిపాలెం పీహెచ్‌సీ

అచ్యుతాపురం: ప్రభుత్వ వైద్య రంగంలో నిర్లిప్తత దొర్లుతుందా.. అంటే అవుననే సమాధానం వస్తుంది. గవర్నమెంట్ ఆస్పత్రుల గురించి పాలకులు పెద్దగా ఆలోచించకపోవడం వల్ల అవి పేదలకు సంపూర్ణంగా వైద్యసేవలు అందించలేకపోతున్నాయనే విమర్శలు ఉన్నాయి. కష్టపడి చదివి.. వైద్యులుగా సేవలందించాలనుకునే ఔత్సాహికులకు సరైన ప్రోత్సాహం లేక వారు ప్రైవేట్ రంగం వైపు ఆకర్షితులవుతున్నారు. దాంతో ప్రభుత్వ వైద్య రంగం బలహీనమవుతోందని చెప్పక తప్పదు.

హరిపాలెం పీహెచ్‌సీ అంటే చిన్నచూపా?

అచ్యుతాపురం మండలంలోని హరిపాలెం పీహెచ్‌సీ పరిధిలో పని చేసే ఇద్దరు వైద్యులు వారి ఉద్యోగాలు వదులుకున్నారు. దీంతో ఈ పీహెచ్‌సీ కళ తప్పింది. సుమారు 24 గ్రామాలకు చెందిన ప్రజలు ఇక్కడ వైద్య సేవలు పొందేవారు. అయితే వారిలో చాలా మంది సమీప ప్రాంతాల్లో ఉన్న ప్రైవేట్ ఆస్పత్రులకు తరలిపోతున్నారు. వైద్యుల కొరత, ఇతరత్రా సమస్యల వల్ల సంపూర్ణ వైద్య సేవలు అందవని వారు ఈ నిర్ణయం తీసుకుని ఉండవచ్చు.

రోజుకి కనీసం 70 మంది అవుట్ పేషెంట్లు వచ్చే ఈ పీహెచ్‌సీకి శుక్రవారం సాయంత్రం కేవలం 31 మంది మాత్రమే వచ్చారు. వైద్యులు లేకపోవడంతో రేగుపాలెం నుంచి ఒక వైద్యురాలిని డిప్యుటేషన్‌పై ఇక్కడ నియమించారు. ఆస్పత్రిలో ఉన్న ముగ్గురు స్టాఫ్ నర్సులు రోజుకి 8 గంటల చొప్పున ఓపీ సేవలు అందిస్తున్నారు. 9 వెల్‌నెస్ సెంటర్లు ఈ పీహెచ్‌సీ పరిధిలో ఉన్నాయి.

సాయంత్రం 4 తర్వాత దయనీయం..

ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ వైద్య సిబ్బంది ఉండటంతో కళగా ఉండే ఈ పీహెచ్‌సీ ఆ తర్వాత దయనీయంగా మారిపోతుంది. ఆస్పత్రిలో వాచ్‌మెన్ గానీ, అటెండర్ గానీ లేకపోవడం గమ నార్హం. దీంతో ఆస్పత్రిని శుభ్రం చేసుకునే దుస్థితి కూడా సిబ్బంది పైనే పడుతోంది.

చెప్పుకోవడానికే గొప్పలు..

రాష్ట్ర ప్రభుత్వం వైద్య సేవల విషయంలో గొప్పలు చెప్పుకోవడమే తప్ప క్షేత్ర స్థాయిలో సదుపాయాలు కల్పించే విషయంలో చిత్తశుద్ధి లేదని విమర్శలు ఉన్నాయి. దీనికి తగ్గట్టు వాచ్‌మెన్, అటెండర్ లేకపోవడంతో సాయంత్రం 4 నుంచి ఉదయం 8 గంటల వరకూ ఒకే ఒక మహిళా స్టాఫ్ నర్సు ఓపీ సేవల కోసం ఒంటరిగా ఉండాల్సిన పరిస్థితి ఉందంటే ఈ పీహెచ్‌సీ పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వానికి ఇంతటి నిర్లక్ష్యం తగదని, పీహెచ్‌సీని శతశాతం బాధ్యతగా నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

కొత్త వైద్యుల్ని నియమిస్తాం..

హరిపాలెం పీహెచ్‌సీకి సంబంధించి ఇద్దరు వైద్యులు రాజీనామా చేసినట్లు ఉన్నతాధికారులకు నివేదించాం. ఎన్నికల కోడ్ తర్వాత కొత్త వైద్యుల్ని నియమిస్తాం. తాత్కాలిక సర్దుబాటు కింద ఇద్దరిని ఆల్టర్‌నేటివ్ రోజుల్లో వినియోగిస్తున్నాం. వాచ్‌మెన్ పోస్టు లేదు. అటెండర్‌ను నియమించాం. కానీ అటెండర్ సిక్‌లో ఉన్నట్లు తెలిసింది. దీనిపై సమీక్షించి అవసరమైతే కొత్తవారిని నియమిస్తాం.

– డీఎంహెచ్‌వో రవికుమార్

ఆకట్టుకున్న లేగదూడల ప్రదర్శన



రైతుకు బహుమతి అందజేస్తున్న డాక్టర్ ప్రదీప్‌కుమార్, బ్యాంక్ మేనేజర్లు రవీంద్ర, ప్రసన్న

మునగపాక: మునగపాకలో శనివారం ఏర్పాటు చేసిన లేగదూడల ప్రదర్శనకు రైతుల నుంచి విశేష స్పందన కనిపించింది. స్థానిక రాహుల్ గాంధీ కల్యాణ మండపం ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రదర్శనను మండల పశు వైద్యాధికారి లావేటి ప్రదీప్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేగదూడల పెంపకంపై రైతులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. లేగదూడలు ఆరోగ్యంగా ఉండేలా చూడాలన్నారు. తద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. మేలుజాతి పశువుల పెంపకం ద్వారా రైతుకు ఆశించిన ఆదాయం సమకూరుతుందన్నారు. యలమంచిలికి చెందిన ఎస్‌ఎంఎఫ్‌జీ బ్యాంకు సహకారంతో ఈ ప్రదర్శన నిర్వహించారు. లేగ దూడల ప్రదర్శనలో చూపరులను ఆకట్టుకున్న వాటికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్లు రవీంద్ర, ప్రసన్నలతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీవో ఉషారాణి, తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు



బి.కె.పల్లిలో తడి-పొడి చెత్త గురించి అవగాహన కల్పిస్తున్న ప్రత్యేకాధికారి శచీదేవి



కొడవటిపూడిలో విద్యార్థుల మానవహారం

మునగపాక: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో ఎం.ఉషారాణి, తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు తెలిపారు. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మునగపాకలో పారిశుధ్యం మెరుగునకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం ద్వారా సంపద తయారై పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఏఈ గులామ్, ఈవోఆర్డీ సోమరాజు, డీటీ శేషుబాబు పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాలతో ఆహ్లాదం..

కోటవురట్ల: స్వచ్ఛ గ్రామాల కోసం ప్రతిఒక్కరూ బాధ్యత వహించాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారి శచీదేవి పిలుపునిచ్చారు. స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం మండలంలో శనివారం నిర్వహించారు. బి.కె.పల్లిలో పర్యటించిన ఆమె కార్యక్రమంలో పాల్గొని చైతన్యం కలిగించారు. వీధులు, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం సిబ్బందితో పాటు ర్యాలీలో పాల్గొని అవగాహన కల్పించారు. తడి-పొడి చెత్తను వేరు వేయడం ద్వారా కలిగే ఉపయోగాలను వివరించారు. ఇంటితో పాటు వీధులను శుభ్రంగా ఉంచుకుందామంటూ ప్రతిజ్ఞ చేయించారు. మన ఇంట్లోనే తడి చెత్తను హోమ్ కంపోస్టుగా తయారు చేసుకుని గార్డెన్‌లో వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు, ఈవోపీఆర్డీ రఘు, ఏపీఎం రమణకుమారి, సచివాలయం, వెలుగు సిబ్బంది, గ్రామైక్య సంఘాల సభ్యులు పాల్గొన్నారు. కొడవటిపూడిలో స్థానిక ఎంపీయూపీ స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించి స్వచ్ఛ గ్రామం కోసం నినాదాలు చేశారు. మానవ హారంగా ఏర్పడి అవగాహన కల్పించారు. హెచ్‌ఎం కృష్ణప్రసాద్, కార్యదర్శి ఎ.రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు ఆర్.ప్రతాప్, లోవరాజు, నాగూర్ బాష, స్థానికులు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే స్వచ్ఛ యలమంచిలి..

యలమంచిలి రూరల్: శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా గాంధీనగరం సచివాలయం పరిధిలో తడి-పొడి చెత్త వేరు చేయడం, దోమల నివారణకు సెప్టిక్ ట్యాంక్ గొట్టాలకు నెట్‌లు అమర్చడంపై స్థానికులకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ పిల్లా రమాకుమారి ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, టీపీవో శ్రీలక్ష్మి, ఏఈ నానాజీ, త్రినాథరావు, శానిటరీ సెక్రటరీలు, మేస్త్రీలు పాల్గొన్నారు.

- స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎం. విజయ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు కళాశాల ఆవరణలో చెత్తను ఊడ్చి శుభ్రం చేశారు. చక్రధర్, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.స్థానిక గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకులు స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. మండలంలోని రేగుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాల పరిసరాలను శుభ్రపరిచారు. ప్రధానోపాధ్యాయుడు గణేష్, రత్నరాజు పాల్గొన్నారు.
- ఏటికొప్పాక మేజర్ పంచాయతీలో ప్రభుత్వ కార్యాలయాల ఆవరణ, పరిసరాలను శుభ్రపరిచారు. ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, స్వయం సహాయక సంఘాల మహిళలు, నరేగా క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం..

పాయకరావుపేట: మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బంది ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహించినట్లు ఎంపీడీవో కార్యాలయం సూపరింటెండెంట్ సీహెచ్‌ఆర్‌కే వర్మ తెలిపారు. అలాగే ఆయా సచివాలయాల సిబ్బంది కూడా పరిశుభ్రత కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు తెలిపారు.

నక్కపల్లిలో స్వచ్ఛ దివస్..

నక్కపల్లి: మండలంలో రాజయ్యపేట, నక్కపల్లి తదితర గ్రామాల్లో ప్రత్యేకాధికారి ప్రసాద్, ఎంపీడీవో సీతారామరాజు ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ర్యాలీ, మానవ హారం చేపట్టారు. ఏపీవోలు శ్రీనివాస్, భాగ్యవతి తదితరులు పాల్గొన్నారు.

దార్లపూడిలో..

ఎస్.రాయవరం: దార్లపూడిలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించి పలు మొక్కలు నాటారు. ఇన్‌చార్జి ఎంపీడీవో ఎస్.సత్యనారాయణ పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వీధుల్లో చెత్త వేయకుండా ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శి రమేష్, ఏపీఎం శివశంకర్, మండల పరిషత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



యలమంచిలి గాంధీనగరంలో స్థానికులకు అవగాహన కల్పిస్తున్న కమిషనర్ ప్రసాదరాజు



మండల పరిషత్ కార్యాలయాన్ని శుభ్రం చేస్తున్న సిబ్బంది



రాజయ్యపేట బీచ్‌లో చెత్త తొలగిస్తున్న అధికారులు

మంచిని బోధించే చిత్రాలు రావాలి



ముసిలితల్లి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో కొత్త సినిమాకు క్లాప్ కొడుతున్న సాయికృష్ణ

మునగపాక: సమాజానికి మంచిని బోధించే చిత్రాలు రావాల్సిన అవసరం ఉందని శ్రీ ధర్మ ఫౌండేషన్ చైర్మన్ కర్రి సాయికృష్ణ అన్నారు. మండలంలోని అరబుపాలెం ముసిలితల్లి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఫైవ్ ఎలిమెంట్స్ క్రియేషన్ అండ్ జీఎంఏ ప్రొడక్షన్ నంబరు-2 బ్యానర్‌పై తెరకెక్కుతున్న పేరు ప్రకటించని కొత్త సినిమాకు ఆయన శనివారం క్లాప్ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి కథతో రూపొందించే చిత్రాలు అందరి మన్ననలు పొందుతాయన్నారు. ఈ సినిమా విజయవంతం కావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సినిమాకు రాజేష్ హీరో కాగా శ్రీజనా హీరోయిన్‌గా నటిస్తున్నారు. నిర్మాత, దర్శకునిగా కె.నవీన్ తేజస్ వ్యవహరిస్తున్నారు. ముఖ్య పాత్రల్లో ఎం.చిన్న గణేష్, అఖిల్ తదితరులు నటిస్తున్నారు. కార్యక్రమంలో పెంటకోట విజయ్, దాడి శివ, పెంటకోట శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా ఇసుక అక్రమ తవ్వకాలు



ట్రాక్టర్ ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న దృశ్యం

పాయకరావుపేట: మండలంలోని పలు ప్రాంతాల్లో ఇసుక అక్రమంగా తవ్వకాలు చేపడుతున్నారు. పాల్మన్‌పేట, వెంకటనగరం, రాజానగరం, కుమారపురం తదితర గ్రామాల పరిధిలో గల ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. సముద్ర తీర ప్రాంతమైన పాల్మన్‌పేట, వెంకటనగరం, కుమారపురం తదితర గ్రామాల పరిధిలో సముద్రతీరంలోను, జీడిమామాడి తోటల్లోను, కుమారపురం గ్రామ పరిధిలో రైతుల పంట పొలాల్లోను, మకాల వద్ద పెద్ద ఎత్తున ఇసుక అక్రమ తవ్వకాలు చేపడుతున్నారు. అదే విధంగా పెదరాంభద్రపురం, కేశవరం, సత్యవరం తదితర గ్రామాల పరిధిలో గల బిరాతీ భూముల్లోను ఏ విధమైన అనుమతి లేకుండా అక్రమార్కులు ఇసుక తరలిస్తున్నారు. ట్రాక్టరు ఇసుక రూ. 4 వేల నుంచి రూ. 5 వేల వరకు అమ్మకాలు సాగిస్తున్నారు. సంబంధిత రెవెన్యూ, పోలీసు అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణా నిలుపుదల చేయాలని పలువురు కోరుతున్నారు.

కిచెన్ గార్డెన్.. హోం కంపోస్టును ప్రోత్సహించాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి ప్రసాద్

నక్కపల్లి: స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో హోం కంపోస్టు, కిచెన్ గార్డెన్‌ను ప్రోత్సహించాలని మండల ప్రత్యేకాధికారి, మత్స్యశాఖ డీడీ ప్రసాద్ అన్నారు. శనివారం నక్కపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎన్‌ఆర్ ఈజీ, వెలుగు, వ్యవసాయ, ఉద్యానవన శాఖల సిబ్బందితో అవగాహన సదస్సు నిర్వహించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సహాయంతో గ్రామాల్లో కిచెన్ గార్డెన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించిందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇళ్ల వద్ద కూరగాయల పెంపకం, పండ్ల మొక్కలు, పూల పెంపకం నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమాలకు ఎన్‌ఆర్‌ఈజీఎస్, వ్యవసాయ, ఉద్యానవనశాఖల సిబ్బంది సహకారం అందిస్తారన్నారు. మండలానికి 7700 హోం కంపోస్టు, కిచెన్ గార్డెన్లు మంజూరయ్యాయన్నారు. ఈ పథకాలకు సంబంధించిన లబ్ధిదారుల వివరాలు ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ఎంపీడీవో సీతారామరాజు, వెలుగు ఏపీఎం సత్యవేణి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ నాగభూషణం, ఏపీవో శ్రీనివాస్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో భాగ్యవతి, ఫీల్డ్ అసిస్టెంట్లు, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయిలోనే సమస్యలు పరిష్కరించుకోవాలి

రాంబిల్లి (యలమంచిలి): భూ సంబంధిత, ఇతర వివాదాలు మండల స్థాయిలో పరిష్కరించుకోవాలని రాంబిల్లి తహసీల్దార్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం రాంబిల్లి తహసీల్దార్ కార్యాలయంలో మండల స్థాయి సమన్వయ కమిటీ సమావేశం జరిగింది.పలు సమస్యలపై వచ్చిన వారికి సలహాలు అందించారు. భూసంబంధిత వివాదాలు, ఇతర సివిల్ తగాదాలు మండల స్థాయిలోనే పరిష్కరించుకోవడానికి మండల స్థాయి అధికారులతో ప్రభుత్వం కమిటీ నియమించినట్లు తెలిపారు.

రాములమ్మకు నివాళి

ఎస్.రాయవరం: ఎస్.రాయవరం మండల జెడ్పీటీసీ కాకర దేవి మాతృమూర్తి ఎస్.రాములమ్మ (71) శనివారం స్వర్గస్తులయ్యారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె చినగుమ్ములూరు స్వగృహం వద్ద తుదిశ్వాస విడిచినట్టు జెడ్పీటీసీ దేవి తెలిపారు. గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించామన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు, ఎంపీపీ కోన లోవలక్ష్మి, సర్పంచ్‌లు గాడి అప్పలనరసింహ, గరగా నూకరాజు, కర్రి సత్యనారాయణ, దూళి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్నసంతాపం తెలిపారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ఎస్.రాయవరం:పెద్దాపురం నుంచి పాయకరావుపేట వరకు ఉన్న 132 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతు కారణంగా ఆదివారం త్రీఫేస్ విద్యుత్ సరఫరా సమయాల్లో స్వల్ప మార్పులు చేస్తున్నట్లు అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు, అర్ధరాత్రి 1 గంట నుంచి ఉదయం 7 గంటల వరకు విద్యుత్ సరఫరా జరుగుతుందని చెప్పారు. పగటి పూట సమయం మార్పు చేసి సరఫరా జరుగుతుందని, ప్రజలు, రైతులు సహకరించాలని కోరారు.

డెక్కన్ ఫైన్ కెమికల్స్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం

పాయకరావుపేట: డెక్కన్ ఫైన్ కెమికల్స్ కంపెనీలో తలసేమియాతో బాధపడుతున్న పిల్లల కోసం శనివారం కంపెనీ వైస్ ప్రెసిడెంట్ అండ్ హెచ్‌ఆర్ పీవీఎస్ఎస్ రాజు ఆధ్వర్యంలో మమత మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్వహణలో మదర్ బ్లడ్ బ్యాంక్, వైఎస్సార్ బ్లడ్ బ్యాంక్‌తో కలిసి మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. 230 మంది కంపెనీ ఉద్యోగులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కంపెనీ వైస్ ప్రెసిడెంట్ వీఎస్ఎస్ రాజు మాట్లాడుతూ తలసేమియాతో బాధపడుతున్న పిల్లల కోసం రెండు సంవత్సరాలుగా కంపెనీ రక్తదాన శిబిరం నిర్వహిస్తుందన్నారు. ఈ సందర్భంగా తలసేమియా పిల్లలకు న్యూట్రిషన్ కిట్లు అందజేశారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట

నక్కపల్లి: మండల కేంద్రం నక్కపల్లి వీవర్స్ కాలనీలో నూతనంగా సుబ్రహ్మణ్య స్వామి ఆలయం నిర్మించారు. ఈ ఆలయంలో శనివారం సుబ్రహ్మణ్య స్వామి, పంచముఖ ఆంజనేయ స్వామి, శ్రీకృష్ణ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం నుంచి వేద పండితులు ప్రత్యేక హోమాలు, విశేష పూజలు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ట, గోపురంపై కలశ స్థాపన కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు

గణపర్తిలో చురుగ్గా సీసీ రోడ్డు పనులు

మునగపాక: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో రహదారుల నిర్మాణాలు వేగవంతం అవుతున్నాయని మండల జనసేన అధ్యక్షుడు టెక్కలి పరశురామ్ అన్నారు. మండలంలోని గణపర్తిలో రూ.5 లక్షల వ్యయంతో నిర్మాణం జరుగుతున్న సీసీ రోడ్డు పనులను శనివారం ఆయన పరిశీలించారు. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలన్నారు. కార్యక్రమంలో కూటమి నేతలు కాళ్ల చంద్రమోహన్, మారిశెట్టి వెంకటరమణ, పంచాయతీరాజ్ ఏఈ గులామ్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం గొలుసు దుకాణాలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎక్సైజ్ అధికారులు, పోలీసులు

రాంబిల్లి (యలమంచిలి): గ్రామాల్లో మద్యం గొలుసు దుకాణాలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తప్పవని యలమంచిలి ఎక్సైజ్ సీఐ తేజో వెంకట కుమార్ తెలిపారు. శనివారం మండలంలోని వాడనర్సాపురంలో మద్యం గొలుసు దుకాణం ఏర్పాటుకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు ఎస్‌ఐ సోమయ్య, రాంబిల్లి ఎస్‌ఐ నాగేంద్రతో కలిసి పరిశీలించారు. గొలుసు దుకాణాల నిర్వహణకు బహిరంగ వేలం పాటలు నిర్వహించరాదన్నారు. గ్రామాల్లో నాటుసారా తయారీపై సమాచారం తెలయజేయాలని, తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ పోలీసులు, రాంబిల్లి పోలీసులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో భాషా నైపుణ్యం పెంపొందించాలి



మాట్లాడుతున్న ఎంఈవో నరేష్

నక్కపల్లి: విద్యార్థుల్లో భాషా నైపుణ్యం పెంపొందించాలని, ముఖ్యంగా పదిలో శతశాతం ఉత్తీర్ణత సాధించే దిశగా చర్యలు తీసుకోవాలని మండల విద్యాశాఖాధికారి కుంచం నరేష్ అన్నారు. శనివారం వేంపాడు, గోడిచర్ల, నక్కపల్లి, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాశాఖాధికారి మాట్లాడుతూ డ్రాపౌట్లు లేకుండా చూడాలన్నారు. విద్యార్థులకు గణితం, భాషల్లో చదవడం, రాయడంపై ప్రత్యేక తర్ఫీదు ఇవ్వాలన్నారు. ప్రతి ఉపాధ్యాయులు ఈ శిక్షణ తరగతులను ఉపయోగించుకోవాలన్నారు. ఈ తరగతులకు రీసోర్స్ పర్సన్లుగా తెలుగు ఉపాధ్యాయులు ఎన్‌వీఎస్ ఆచార్యులు, సునరంజని, వైవీ రమణ, శేఖర్, శ్రీనివాస్ వ్యవహరించారు. వేంపాడు, గొడిచర్ల, చినదొడ్డిగల్లు, నక్కపల్లి క్లస్టర్ పరిధిలో ఉన్న హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు తదితరులు హాజరయ్యారు.